క్రీడా పోటీల విజేతలకు మెమెంటోలు అందజేత


విజేతలకు మెమెంటోలు అందజేస్తున్న హైదరాబాద్ డీఈవో రోహిణి

రాంనగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మండల విద్యాశాఖ నిర్వహించిన ఇంటర్ స్కూల్ క్రీడల్లో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలకు చెందిన జట్లు ప్రతిభ చూపాయి. కబడ్డీ, ఖోఖో పోటీలలో బాలుర జట్టు మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఖోఖో పోటీలలో బాలిక జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. సోమవారం విజేతలు హైదరాబాద్ డీఈవో రోహిణీ, ముషీరాబాద్ మండలం డిప్యూటీ ఈవో చిరంజీవి, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో మెమెంటోలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తి కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సరోజ వివేక్, పీఈటీ పి.జి.సురేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్, వివిధ ఆస్పత్రుల సౌజన్యంతో అక్టోబర్ 2న దోమలగూడలోని ఏవీ కాలేజీలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రపంచ వయోధికుల దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో గుండె, గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, యూరాలజీ సహా 23 రకాల ఉచిత ఆరోగ్య సేవలు అందించనున్నారు. రేపు ఉదయం 8.30 నుంచి సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని ఈవెంట్ మేనేజర్ లయన్ జీకే రమణ సోమవారం వెల్లడించారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

లైబ్రరీ ఉద్యోగులు సేవాభావంతో పనిచేస్తున్నారు


మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న రియాజ్

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీ ఉద్యోగులు సేవా భావంతో పనిచేయడం మంచి పరిణామమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్, హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జ్, నగర అదనపు కలెక్టర్ పళని కదిరవన్ అన్నారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ టెక్నికల్ సెక్షన్ ఇన్‌ఛార్జ్ గాడిచర్ల మదన్‌మోహన్ సోమవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆయనను వట్టికోట ఆళ్వారుస్వామి ఆడిటోరియంలో లైబ్రరీ కార్యదర్శి పి.పద్మజతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠకుల సౌకర్యార్థం ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రతిభ, మంచితనం, ఆధ్యాత్మికభావన, స్నేహభావన, యూనియన్ లీడర్‌గా సమర్థనాయకత్వంతో మెలుగుతూ ఎలాంటి మచ్చలేకుండా మదన్‌మోహన్ పనిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిటీసెంట్రల్ లైబ్రరీ మాజీ ఛైర్‌పర్సన్ ప్రసన్న, లైబ్రరీ అధికారులు, సిబ్బంది, టీఎన్‌జీవో నాయకులు అయోధ్య, బొల్లం మహేందర్, వెంకటేష్‌యాదవ్, సుకేష్‌కుమార్, అవినాష్‌రావు, చంద్రకళ, సుబ్బలక్ష్మి, మంజులవాణి, సీతామహాలక్ష్మి, వెంకటేష్‌యాదవ్, మహేష్, రామ్మోహన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌నగర్ కాలనీ, పవిత్రనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీల అధ్యక్షులు నరేష్‌గౌడ్, చక్రపాణి డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఈ రెండు కాలనీలలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, కొత్త రోడ్లు వేసేందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వరద నీటి కాలువలో డ్రైనేజీ లైన్ కలపడం వల్ల దుర్వాసన వస్తుందన్నారు. కాలనీలలో లేవుట్ ప్రకారం 30 ఫీట్ల రోడ్డు ఉందని, అయితే చాలా మంది ఇంటి ముందు అరుగులు వేయడం వల్ల ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. చేపల మార్కెట్ కారణంగా వాహనాలను బందర్ ఫంక్షన్ చౌరస్తా నుంచి తమ కాలనీ మీదుగా రాకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి వినియోగించే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. చొక్కారపు శ్రీకాంత్‌గుప్తా, సాయికుమార్, గిరిధర్, శ్రీధర్, బాలచందర్, శేఖర్ పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి


త్రినాథరావును సత్కరించిన నిర్వాహకులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి సుస్వరాలు సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా త్యాగరాయగానసభలో సోమవారం నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో భాగంగా గాయనీగాయకులు ఝాన్సీశోభ, సుశీలదేవి, సౌభాగ్యలక్ష్మి, కల్యాణి, మంజుల, పద్మలత, స్వర్ణ, లక్ష్మీరత్నం తదితరులు ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు త్రినాథరావును సన్మానించారు. వంశీరామరాజు, బీజేపీ నేత వంశీ, మల్లెపూల వెంకటరమణ, నిర్వాహకులు జ్యోతిర్మయి, నర్సింహులు పాల్గొన్నారు.

'శ్యామగాయత్రి' సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో..

పాటలు సమాజంపై ఎక్కువ ప్రభావం చూపుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్యామగాయత్రి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో 'తెలుగు పదానికి జన్మదినం జానపదానికి జ్ఞానపదం' శీర్షికతో నిర్వహించిన గానవిభావరి శ్రోతలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు, సినీ నిర్మాత ఉల్బుందకర్ మురళీధర్ తదితరులు ప్రముఖ శాస్త్రీయ సంగీత గాయని చిల్లా శివపార్వతిని సన్మానించారు. బాబురావు, కోటంరాజు, శ్రీనివాసమూర్తి, పాండురంగప్రసాద్, విజయ్‌కుమార్, ఎల్‌పీ రావు, వెంకట్రావు, వినోద్, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్‌పీల యూనియన్ గౌరవాధ్యక్షురాలిగా రమ

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెప్మా ఆర్‌పీల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా ఎస్‌వీ రమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 29న జరిగిన యూనియన్ రాష్ట్ర సదస్సులో ఆమెను ఎన్నుకున్నారు. రమ సోమవారం చిక్కడపల్లిలో మాట్లాడుతూ.. ఆర్‌పీలకు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరకమైన యూనిఫాం ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా కల్పించాలని, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుటుంబ కథా చిత్రాలు రావాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంపై ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేసేలా కుటుంబ కథాచిత్ర సినిమాలు విరివిగా రావాల్సిన అవసరముందని ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు అన్నారు. ఫాస్‌ఫిలిం సొసైటీ, ఇట్‌క్లా సంస్థల నిర్వాహకులు డా. కె.ధర్మారావు సోమవారం రేలంగి నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. యువత సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. తాను తీసిన సినిమాలన్నీ కుటుంబ కథా చిత్రాలేనన్నారు. సాహితీ ప్రముఖులు డా. ఓలేటి పార్వతీశం పాల్గొన్నారు.

నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్‌కు 8 మంది ఎంపిక

బర్కత్‌పుర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు అక్టోబర్ 3 నుంచి 5 వరకు పుదుచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయని కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ రొయ్యూరు సురేష్, ప్రధాన కార్యదర్శి వసంత మాధురి తెలిపారు. సోమవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఆటగాళ్లు ఎంపికయ్యారని వారిలో బీఎం.పవన్ కుమార్, ఎం.నాగఅక్షయ, మేజర్ పద్మజ, ఎం.లక్ష్మి చైతన్య, జి.కృష్ణమూర్తి, ఆర్.ప్రత్యూష, వి.వసంతమాధురి ఉన్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు గట్టి పోటీ ఇచ్చి పతకాలు సాధిస్తామని వారు పేర్కొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎమ్మెల్యే కాలేరు భరోసా
- నేడు పలు ప్రాంతాల్లో పర్యటించనున్న కేటీఆర్


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదలు ఎవరూ తమ ఇళ్లు కోల్పోతారని అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భరోసా కల్పించారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ప్రజాప్రతినిధులు పర్యటిస్తున్నారని, ప్రజలు వారికి తమ బాధలు చెప్పాలని సూచించారు. సోమవారం గోల్నాక డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్, న్యూకమలానగర్ మూసీ పరివాహక ప్రాంతాలలో ఆయన పర్యటించారు. తమ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇళ్లను కూలుస్తామని చెబుతున్నారని, దీంతో ఆందోళన చెందుతున్నామని చెప్పారు. హైడ్రా అధికారులు ఎప్పుడు వస్తారో అనే భయంతో నిద్రలేకుండా గడుపుతున్నామని మహిళలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసి పైసా పైసా కూడబెట్టి, అప్పు చేసి స్థలాలను కొని ఇళ్లు కట్టుకుంటే.. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో కూల్చివేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నించారు. తమ ఇళ్లను కూలిస్తే సహించేది లేదని, అధికారులను ఎదిరిస్తామని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్ పేదల పక్షాన పోరాడుతుంది

బీఆర్ఎస్ పేదల పక్షాన పోరాడుతుందని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే కాలేరు వారికి సూచించారు. అన్ని ప్రాంతాలలో పార్టీ అగ్రనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నాయకులు పర్యటించి వారికి బాధితులకు అండగా ఉంటారన్నారు. అందులో భాగంగా మంగళవారం కేటీఆర్, ప్రజాప్రతినిధులు, నాయకులు డివిజన్‌లోని మూసీ పరివాహక ప్రాంతాలైన తులసీరాంనగర్(లంక), కమలానగర్, అంబేడ్కర్‌నగర్ తదితర బస్తీలలో పర్యటిస్తారని చెప్పారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కేటీఆర్‌కు బాధలు విన్నవించుకోవాలని సూచించారు.

సత్యనారాయణబాబుకు జైసింహ పరామర్శ


సత్యనారాయణ బాబును పరామర్శిస్తున్న జైసింహ

ముషీరాబాద్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణబాబుపై అకారణంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ డిమాండ్ చేశారు. పోలీసుల దాడిలో గాయపడిన సత్యనారాయణబాబును సోమవారం వినోభానగర్‌లో ని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ.. పోలీసులు అన్యాయంగా సత్యనారాయణపై దాడి చేసి చెయ్యి విరగొట్టారని, పోలీస్ ఉన్నతాధికారులు ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్‌ల బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, డివిజన్ నాయకులు పూస గోరక్‌నాథ్, భాస్కర్‌నేత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ధర్నా

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచకుండా అన్యాయం చేసిందని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూపాల్, ఎస్వీ రమ, మల్లికార్జున్, ఈశ్వర్‌రావు, చంద్రశేఖర్, వీఎస్‌రావు, వంగూరు రాములు, రాజారావు, వెంకటేష్, మధు, పద్మశ్రీ, రమేష్, మాధవి తదితరులు కలిసి అదనపు కమిషనర్ డా. గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు

అంబర్‌పేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ దుర్గానగర్‌లో ఇళ్లపై విద్యుత్ తీగలకు ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారులు తొలగించారు. చెట్ల కొమ్మల సమస్యలపై బస్తీవాసులు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన సిబ్బందితో కలిసి కొమ్మలను తొలగింపజేశారు. సమస్యలను పరిష్కరించేందుకు తాను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని కార్పొరేటర్ పేర్కొన్నారు.

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బర్కత్‌పుర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రావు సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ సరికాదన్నారు. సోమవారం కాచిగూడ బద్రుక కళాశాల వద్ద ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంగ్ సైడ్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని, కొన్ని సందర్భాలలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. కొంత మంది విద్యార్థులు రోడ్లపై ద్విచక్రవాహనాలతో విన్యాసాలు చేస్తున్నారని, ఇది ప్రమాదాలు జరగడానికి కారణమవుతుందన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

బర్కత్‌పుర, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద సోమవారం 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని మహిళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బ్యాగును దొంగలు లాక్కొని పారిపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాఖీ (49) ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తోంది. మహారాష్ట్రలోని బల్లార్షా వద్ద రాఖీ హ్యాండ్ బ్యాగును దొంగలు లాక్కొని పారిపోయారు. బ్యాగులో మూడు సెల్‌ఫోన్‌లు, ఆరు గ్రాముల బంగారు రింగు, డెబిట్ కార్డులు, ఆధార్ కార్డు ఉన్నాయి. కాచిగూడకు వచ్చిన తర్వాత సోమవారం ఆమె కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్త నేర న్యాయ చట్టాలను ఉపసంహరించుకోవాలి: ఐఎఫ్‌టీయూ

కవాడిగూడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన మూడు నేర న్యాయ చట్టాలు, లేబర్ చట్టాలకు చేసిన నాలుగు సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొత్త లేబర్ చట్టాలను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీ ద్వారా ఒక తీర్మానాన్ని చేసి కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కొత్త నేర, కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బూర్గుల ప్రదీప్, అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలకు చేసిన సవరణలు దేశంలోని కార్మిక వర్గాన్ని మరింత బానిసత్వంలోకి నెట్టే విధంగా ఉన్నాయని వారు ఆరోపించారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు దసరా సెలవులివ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

రాంనగర్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన సెలవులను రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో అమలు చేయడంతో పాటు టీచర్లకు సైతం సెలవులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ కె.విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇ.వి.నర్సింహారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు సెలవులు ఇచ్చి టీచర్లకు ఇవ్వడం లేదన్నారు. కొన్ని పాఠశాలలు టీచర్లకు వర్క్ షాపులు నిర్వహిస్తున్నాయన్నారు.

ప్రజల సహకారంతో ఆలయాభివృద్ధి

అంబర్‌పేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సహకారంతో అంబర్‌పేట మహంకాళి ఆలయ అభివృద్ధి జరుగుతుందని దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవస్థానంలో నూతనంగా సభ్యత్వం పొందిన 620 మందికి దేవస్థాన సేవా సమితి ప్రధాన సలహాదారు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్‌గౌడ్ సభ్యత్వ పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహంకాళి ఆలయానికి నగరంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గత 70 సంవత్సరాలుగా దేవస్థాన సేవా సమితి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో దేవస్థాన సేవా సమితి అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శి చెంగలి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి కిషోర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 30న ఉగాది జరుపుకోవాలి

నల్లకుంట, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): సనాతన శాస్త్రం ఆధారంగా విశ్వావసు సంవత్సరం (2025-2026)లో మార్చి 30న ఉగాది పర్వదినం జరుపుకోవాలని నిర్ణయించినట్లు వేదాంతాచార్య పీఠ ఆస్థాన సిద్ధాంతులు సంపత్‌కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి, శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి అధ్యక్షుడు యాదగిరి స్వామి తెలిపారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో వారు మాట్లాడారు. ఈ సంవత్సరం ఉగాది వేడుకల తేదీలపై గందరగోళం నెలకొందని, ఏ తేదీన పండగ జరుపుకోవాలో తేదీలను నిర్ధారించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు. వెంకటకిషోర్, సౌమిత్రి శ్రీధర్‌స్వామి, వరదస్వామి, వేణుస్వామి, ఆచార్య ఆత్రేయ, గోవర్ధనం, వెంకటరమణాచార్య తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీని నియంత్రించాలి

బర్కత్‌పుర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ ఆహార పదార్థాలను నిరోధించడానికి స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలను ప్రభుత్వం విరివిగా ఏర్పాటు చేయాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ కె.వినయ్‌కిషోర్‌యాదవ్ డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ కల్తీని గుణపాఠంగా తీసుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో కొంతమంది కల్తీదారులు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. సోమవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల నాణ్యతను గుర్తించడానికి ఆధునిక టెక్నాలజీతో స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని కోరారు.

రుణభారం మోయలేక.. చావే శరణ్యమని భావించి..

- పురుగుల మందు తాగిన తల్లిదండ్రులు, ముగ్గురు కుమారులు

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించింది. భార్యాభర్తలు, ముగ్గురు కుమారులు పురుగుల మందు తాగిన సంఘటన సోమవారం రాత్రి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్(60), లత (55) దంపతులకు సందీప్(30), సాయి స్వరూప్(28), వంశీకృష్ణ(26) సంతానం. వెంకటేశ్వర ప్రసాద్ తొమ్మిదేళ్ల క్రితం కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాంనగర్ కాలనీలో నివసిస్తూ గౌతంనగర్ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నారు. వెంకటేశ్వరప్రసాద్, రెండో కుమారుడు సాయి స్వరూప్ కిరాణదుకాణం నడుపుతుండగా, మొదటి కుమారుడు సందీప్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడో కుమారుడు వంశీకృష్ణ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. రూ. 12 లక్షలు అప్పు చేసి కిరాణా దుకాణాన్ని అభివృద్ధి చేశారు. గత ఏడాది దుకాణం ఉన్న వీధిలో రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. పనులు పూర్తికాకపోవడంతో గిరాకీ తగ్గింది. రాబడి తగ్గడం, అప్పులకు వడ్డీ చెల్లిస్తుండడంతో పూట గడవడం కష్టం అయింది. ఏడాది నుంచి కిరాణా దుకాణం సరిగా నడవకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయారు. వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అప్పు ఇచ్చిన వారు డబ్బు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో కొన్ని నెలలుగా తీవ్ర మానసికక్షోభకు గురవుతున్నారు. వీటి నుంచి బయట పడాలంటే తమకు చావే శరణ్యమని భావించారు. ఈ క్రమంలో సాయి స్వరూప్ గౌలిగూడ వెళ్లి వెళ్లి పీఎస్-77 అనే పురుగుల మందు కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు ఐదుగురు పురుగుల మందును నీటిలో కలుపుకుని తాగారు. తాము పురుగుల మందు తాగామని వెంకటేశ్వర ప్రసాద్ తమ ఇంట్లో కింది పోర్షన్‌లో కిరాయికి ఉంటున్న వారికి ఫోన్ చేసి చెప్పాడు. వారు వెంటనే 100, 108కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చి పైకి వెళ్లి తలుపు కొట్టారు. స్పృహలో ఉన్న రెండవ కుమారుడు తలుపులు తీశాడు. పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్‌ఐ మారయ్య ఐదుగురినీ 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు కుమారుల ఆరోగ్యం నిలకడగా ఉందని, భార్యాభర్తలు అపస్మారక స్థితిలో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారని ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరద నీటి సమస్యను పరిష్కరిస్తాం


అధికారులు, స్థానికులతో కలిసి అశోక్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 1లో సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పేర్కొన్నారు. స్ట్రీట్ నెంబర్ 1లోని సౌభాగ్య ఎవెన్యూ అపార్ట్‌మెంట్స్ వద్ద నిర్మించిన నాలా రిటైనింగ్ వాల్ వద్ద తరచూ వరదనీరు నిలిచిపోయి కాలనీవాసులకు ఇబ్బందిగా మారింది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ ఏఈ శ్యామ్‌సుందర్, ఇంజనీరింగ్ ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. వరదనీరు నిలిచిపోకుండా నాలాలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. బీజేపీ నేత వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్‌కుమార్

చిక్కడపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్. రమేశ్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల పరిధిలోని అమ్మవారి మండపాల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, డీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

డీజే, బ్యాండు నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఏసీపీ మొగులయ్య

కవాడిగూడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీజే సౌండ్ సిస్టమ్, బ్యాండు నిర్వాహకులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు సోమవారం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీజే, బ్యాండు నిర్వాహకులకు అవగాహన కల్పించారు. గాంధీనగర్ సీఐ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏసీపీ మొగులయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, దసరా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి మండపాల వద్ద, విగ్రహాల నిమజ్జన సమయంలో డీజే, బ్యాండు సౌండ్ సిస్టమ్‌లను ఉపయోగించొద్దన్నారు. శబ్దకాలుష్యంతో ఇరుగుపొరుగు వారికి ఇబ్బందులు కలిగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండపాల నిర్వాహకులు సైతం నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు నాగరాజురెడ్డి, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమల లడ్డూ వివాదంపై కాచిగూడ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు


ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు జావిద్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని యూసుఫ్ దర్గాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ చాదర్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, మైనార్టీ కమిటీ నాయకులు ఇమ్రాన్, ఖదీర్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

సమస్యలను పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. అంజుమన్ కమ్యూనిటీ హాల్, పద్మశాలి కాలనీ నాలాల్లో చెత్తను తొలగించాలని కోరారు. భోలక్‌పూర్‌లో ప్రతి షాపు, ఇంటికి వెళ్లి చెత్తను సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రహిమొద్దీన్, ఖాజామొహినొద్దీన్, చాంద్, మగ్దూమ్, మసూద్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరాపార్కు వద్ద జరిగిన రైతు హామీల సాధన దీక్షకు ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఓబీసీ మోర్చా నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీగా తరలివెళ్లి మద్దతు తెలియజేశారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సైతం దీక్షకు మద్దతు తెలిపారు. - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి


అంబర్‌పేట డివిజన్ ఎంసీహెచ్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వం చేయిస్తున్న డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి తదితరులు. - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి